క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభం చేస్తున్న నాయకులు

గొలుగొండ: చోద్యం సెంటర్ నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి నర్సీపట్నం మున్సిపాలటీ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షల నాబార్డు ప్రత్యేక నిదులు మంజూరైనట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ ప్రభాకరరావు, నాబార్డు ప్రత్యేక డీఈఈ సత్యనారాయణ, జేఈ డైసీ పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం



జి.కోడూరులో డ్రైనేజీ చెంతనే పేరుకుపోయిన చెత్త

మాకవరపాలెం: మండలంలోని జి.కోడూరులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా చెత్తను తొలగించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. దీని కారణంగా వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేసపట్టాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



తెనుగుపూడిలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఎస్.గోవింద

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా నరాల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గోపాలపట్నంకు చెందిన శ్రీకృష్ణ న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ప్రముఖ న్యూరోఫిజిషియన్ సిరపరపు గోవింద వైద్య పరీక్షలు చేశారు. నరాలు, మెదడు, వెన్నుముక, ఫిట్స్, మూతి వంకర పోవడం, డిస్క్ సమస్యలు, తిమ్మిర్లు, మైగ్రేన్ తలనొప్పి, మతిమరుపు, తలతిరగడం తదితర సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 90 మందికి వైద్య సేవలందించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అప్పలరాజు ప్రమాణ స్వీకారం

మాడుగుల: స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పుప్పాల అప్పలరాజుతో పలువురు డైరెక్టర్లుగా శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని కమిటీ సభ్యులను అభినందించారు. కొత్త పాలకవర్గంతో ఏడీ అశోక్‌కుమార్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, సర్పంచ్ ఎడ్ల కళావతి, తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్‌పై ఆగ్రహం

మునగపాక: పూడిమడక రోడ్డులో అధిక లోడుతో వెళ్తున్న వాహన డ్రైవర్‌పై శుక్రవారం సాయంత్రం మునగపాకలో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వాహనాల వల్ల సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కొంత కాలం క్రితం స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో రాత్రి 10 గంటల తర్వాత నుంచి తెల్లవారు లోగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు అంగీకరించారు. ఇదేమీ పట్టనట్లు లారీ డ్రైవర్లు అధిక లోడుతో వాహనాలను తిప్పుతున్నారు. దీనిలో భాగంగా అధిక లోడుతో రాయిని తరలిస్తున్న లారీని స్థానికులు అడ్డుకున్నారు. ఈ మార్గంలో రాత్రి సమయంలో మాత్రమే రాకపోకలు సాగించేలా అధికారులు చొరవ చూపుతుంటే, అధిక లోడుతో ఎలా వస్తారంటూ స్థానికులు సంబంధిత డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచింది. మునగపాక పోలీసులు రంగ ప్రవేశం చేసి లారీ డ్రైవర్‌ను మందలించారు.

- బోడిగరువులో గిరిజన విద్యార్థుల దయనీయ పరిస్థితి
- పాఠశాల భవన నిర్మాణానికి 9 సెంట్ల స్థలం దాతల వితరణ
- గత ప్రభుత్వంలో నాడు–నేడులో రూ.28 లక్షల మంజూరు
- పనుల్లో జాప్యంతో పునాది దశలోనే నిర్మాణం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వంపై **గిరిజనుల ఆగ్రహం**

ఇంకెన్నాళ్లు.. రచ్చబండ చదువులు?



బోడిగరువులో రచ్చబండపై చదువుకుంటున్న గిరిజన విద్యార్థులు

దేవరాపల్లి: దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ బోడిగరువు గిరిజన గ్రామంలో రచ్చబండపై చదువులు కొనసాగిస్తూ విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ పాఠశాలకు సొంత భవనం లేక పోవడంతో ఓ ఇంటి ఇరుకు గదిలో కొందరు, చెట్టు నీడలో రచ్చబండపైన మరికొంత మంది చదువుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిపోతున్నా పాఠశాల భవన నిర్మాణంపై దృష్టిసారించకపోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత కల్పించి నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చగా, కూటమి ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తోంది. ఇందుకు బోడిగరువులోని విద్యార్థులు పడుతున్న అవస్థలే నిదర్శనం. బోడిగరువులోని ప్రాథమిక పాఠశాలకు నేరెళ్లపూడి, మదనగరువు, కల్యాణగుమ్మి, తట్టపూడి, కొట్టింగూడ, కడ్రేవు శివారు గ్రామాల నుంచి 33 మంది విద్యార్థులు హాజరై విద్యాభ్యాసం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరు

గతంలో నేరెళ్లపూడిలో ఈ పాఠశాల ఉండేది.



ఓ ఇంటి ఇరుకు గదిలో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

అయితే మిగిలిన గ్రామాలకు దూరంగా ఉండటంతో పాటు విద్యార్థులు గెడ్డలు దాటి రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అందరికీ అందుబాటులో ఉండేలా మధ్యస్తంగా ఉన్న బోడిగరువు గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, స్థానిక గిరిజనులు 2023లో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనతో పాఠశాల భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన దాతలు గుమ్మడపు దేవి, దేముడుబాబు దంపతులు 9 సెంట్ల స్థలం దానం చేశారు. వెంటనే పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు అప్పట్లోనే ఆదేశాలు జారీ చేశారు.



పాఠశాల భవన నిర్మాణానికి దాతలు ఇచ్చిన స్థలంలో గొయ్యిలు తవ్విన దృశ్యం

ఈ నేపథ్యంలో నాడు–నేడులో భవన నిర్మాణానికి రూ.28 లక్షలు నిధులు మంజూరు చేసి, విద్యార్థులకు అవసరమైన బెంచీలు, టీవీ, ఇతర పరికరాలను సైతం అందజేశారు. 2023 డిసెంబర్ 24న ఈ భవన నిర్మాణానికి ముత్యాలనాయుడు భూమి పూజ చేశారు. అయితే తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇటీవల భవన నిర్మాణానికి పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఓ ఇంటి ఇరుకు గదిలోను, రచ్చబండపై విద్యాభ్యాసం చేస్తూ ఎండ, వానకు విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇంకెన్నాళ్లు ఈ రచ్చబండపై చదువులు అంటూ పాలకుల నిర్లక్ష్య తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోజూ 6 కి.మీ. నడిచి వస్తున్నా..



మా గ్రామం నుంచి ఆరు కిలోమీటర్ల దూరం నుంచి కాలినడకన పాఠశాలకు వస్తున్నా. పాఠశాల భవనం లేకపోవడంతో రచ్చబండపైనా, ఇంటి గదిలోను మాకు చదువులు చెబుతున్నారు. వర్షం వస్తే ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి భవనం నిర్మించాలి.

– వంతల అంజలి, విద్యార్థిని, కల్యాణగుమ్మి

భవనం లేక రచ్చబండపైనే విద్య



బోడిగరువు ప్రాథమిక **పాఠశాలలో** 33 మంది **విద్యార్థులు** ఉన్నారు. **భవనం లేక** పోవడంతో **ఒక ఇంటి** గదిలోను, **రచ్చబండపై** విద్యాబోధన **చేస్తున్నాం**. పాఠశాల భవన నిర్మాణానికి **స్థానికులు** తొమ్మిది సెంట్ల స్థలాన్ని **రాసిచ్చారు.** గత ప్రభుత్వంలో నాడు–నేడులో **భవన రూ.** 28 లక్షలు మంజూరయ్యాయి. **రెండు వారాల** క్రితమే భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

– **జి.జగదీశ్వ**రరావు, హెచ్ఎం, బోడిగరువు

యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు



బోడిగరువు పాఠశాల భవన నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాలతో మెటీరియల్ తెప్పించి తక్షణమే పనులు ప్రారంభించాం. త్వరితగతిన భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

– వి.ఉషారాణి, ఎంఈవో–2, దేవరాపల్లి

క్వారీ బాధిత రైతులకు సీపీఐ మద్దతు



అల్లూరి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న క్వారీ బాధిత దళితులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జి.కోడూరు క్వారీ బాధితుల నిరసనకు సీపీఐ మద్దతు తెలియజేసింది. నిరాహార దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా పెదబొడ్డేపల్లి మదుం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ మాకవరపాలెం మండల సెక్రటరీ తాతబ్బాయి మాట్లాడుతూ క్వారీ అనుమతులను వెంటనే రద్దు చేయాలన్నారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, అధికారులు ఎంత నిర్లక్ష్యం చేసినా పోరాటం ఆపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బొంతు రమణ, మట్ల చంటిబాబు, సీపీఎం నాయకుడు చిరంజీవి, రైతులు అప్పారావు, పెంటయ్య, కళ్యాణ్, లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కోనాంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

చీడికాడ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం మండలంలోని కోనాంలో నిర్వహించనున్నట్టు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి జి.మంగవేణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు ఉదయం 10 గంటలకు గురుకుల బాలికల పాఠశాల సమీపంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఈ వేడుకలకు హాజరు కానున్నట్టు ఆమె తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతం



కుటుంబ సభ్యులతో కలిసి వరలక్ష్మీ వ్రతంను ఆచరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు

నర్సీపట్నం: వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు శుక్రవారం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలో కొలువుదీరిన దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంతో ఆటు అన్ని ఆలయాల్లో వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచి ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి వరలక్ష్మి వ్రతంను ఆచరించారు.

నాతవరం: మండలంలో శుక్రవారం వాడవాడలా వరలక్ష్మీదేవి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసం పౌర్ణమి ముందు రోజు శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వరలక్ష్మీదేవి వ్రతాన్ని ఆచరించారు. ఇళ్లలో పూజలు అనంతరం గ్రామాల్లోని ఆలయాలను దర్శించుకున్నారు. పలు గ్రామాల్లో కోలాటాలు, భజనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదుర్గామల్లేశ్వరస్వామి

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషిమాత అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో పూజలు అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామానికి చెందిన వేగి రాము సహకారంతో గ్రామం నుంచి ఆలయం వరకు ఉచిత ఆటో సౌకర్యం కల్పించారు. కె.జె.పురం రామాలయం చుట్టూ శుక్రవారం రాత్రి దీపాలంకరణ చేశారు.ఆలయం ముందు చెట్టు భజన వద్ద మహిళలు దీపారాధన చేసి, పూజలు నిర్వహించారు.



నర్సీపట్నంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



కె.జె.పురం రామాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

రోలుగుంట: మండలంలో అన్ని గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. ఆలయాల్లో సాయంత్రం పూజలు, దీపార్చన చేశారు.

మాడుగుల: స్థానిక దేవీ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీదేవి పూజలు చేశారు. ప్రత్యేక వరలక్ష్మీ దేవీ వ్రతంలో సుమారు 150 మంది దంపతులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించకుకోవడానికి భక్తులు బారులు తీరారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

గొలుగొండ: మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్‌పురం గ్రామంలో దోమల నివారణకు పంచాయతీ పాలకులు చర్యలు తీసుకున్నారు. వ్యాదులు సోకకుండా ముందుగానే దోమల నివారణ మందును పిచికారీ చేశారు. కాలువలు, తాగునీటి కుళాయిలు, చేతి పంపు బోర్ల వద్ద ఈ పిచికారీ చేసినట్టు సర్పంచ్ లోచల సుజాత, కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

అదానీతో కూటమి నేతల రహస్య మంతనాలు

- తరచూ ఢిల్లీ పర్యటనలతో ఆందోళనలో రైతులు, గిరిజనులు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న విమర్శ



దేవరాపల్లి: అదానీ గ్రూపు సంస్థలతో అధికార కూటమి పార్టీల నేతలు రహస్య మంతనాలు జరుపుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న ఆరోపించారు. ఈ మేరకు దేవరాపల్లిలో శుక్రవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. చింతలపూడి, మారిక మధ్య అదాని హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం తలపెడుతున్న తరుణంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తుడడంతో స్థానిక రైతులు, గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత నెల 29న రైవాడ ఆయకట్టుకు నీరు విడుదల సందర్భంగా జరిగిన సభలో అదానీ హైడ్రో పవర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారని, ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన రాలేదన్నారు. దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం, మునగపాక, యలమంచిలి, రాంబిల్లి వరకు వేలాది ఎకరాలకు సాగునీరు, విశాఖ ప్రజలకు తాగునీరు అందిస్తున్న రైవాడ ప్రాజెక్టు క్యాచ్‌మెట్ ఏరియాలో హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణాన్ని విరమించుకోవాలన్నారు. చింతలపూడి, మారిక ప్రాంతాలలో 800 ఎకరాలకు పైబడి భూములు తీసుకోవాలని గత నెల 30న జీవో నెంబర్ 51ను విడుదల చేసిందన్నారు. రైతులు, గిరిజనుల పోరాటానికి మద్దతు ప్రకటించి, హైడ్రో పవర్ ప్లాంట్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గాజుల అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి

కె. కోటపాడు: కె.కోటపాడులో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 102 డజన్లతో శుక్రవారం అర్చన చేశారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని అర్చకుడు గోరుమంతు రమేష్‌బాబు అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల రాంబాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అమ్మవారి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు చేశారు.



కె. కోటపాడు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 102 డజన్ల గాజుల అలంకరించిన భక్తులు

గిరిజనులను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి



మాట్లాడుతున్న నాన్ షెడ్యూల్ ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి

మాడుగుల: నాన్ షెడ్యూల్ ఆదివాసీ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. మండలంలో శంకరం పంచాయతీ తాడివలస రాయి పనుకు వద్ద మైదాన ప్రాంత ఆదివాస గిరిజనులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టి, నిజమైన ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 320 ఆదివాసీ గిరిజన గ్రామాలున్నాయని, ఐదో షెడ్యూల్‌లో చేర్చకపోవడంతో మైనింగ్ మాఫియాతో పాటు పెత్తందారులు అడవుల ఆక్రమణకు పాల్పడుతున్నారన్నారు. వీరికి ఐటీడీఏ పథకాలు అందకపోవడంతో పాటు విద్య, ఉద్యోగ అవకాశాలు పొందలేకపోతున్నారని చెప్పారు. మైదాన ఆదివాసి హక్కులపై జరుగుతున్న దాడులను తిప్పి కొట్టడానికి ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజనులు గిన్నెల పల్లి సన్యాసమ్మ, సోమల నరసింహమూర్తి, సిదిరి ఈశ్వరరావు, గొట్టూరు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో భారీ వర్షం



దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మోస్తారు గాలులతో పాటు ఏకధాటిగా గంటకుపైగా వర్షం పడింది. దీంతో ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. గత రెండు వారాలు ఎండల తీవ్రత, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. ఖరీఫ్ వరి నాట్లుకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.